నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో..

2017 అక్టోబర్.. కృష్ణరాయపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో 9వ తరగతి విద్యార్థిని దారుణహత్యకు గురైంది. అపార్ట్‌మెంట్ పై అంతస్తు నుంచి పడిపోయినట్లు చిత్రీకరించారు. అనుమానితుడికి బంధువైన ఓ రౌడీషీటర్ ప్రమేయంతో అధికారపార్టీ నాయకులు ఆ కేసును ఆత్మహత్యగా చిత్రీకరించేలా పోలీసులపై ఒత్తిడి చేశారన్న ఆరోపణలు వినిపించాయి.

2018 డిసెంబర్.. పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధి సత్తివానిపాలెంలో ఓ మైనారిటీ సంస్థకు చెందిన భూమిలో అప్పటి అధికార పార్టీకి చెందిన ఓ రౌడీషీటర్ తన అనుచరులతో చొరబడ్డాడు. ట్రాక్టర్లతో దున్నేశాడు. ఆక్రమణకు రంగం సిద్ధం చేస్తూ షెడ్‌లు, బోర్‌వెల్‌లు ఏర్పాటు చేసేశాడు. దీంతో చేసేది లేక బాధితులు పోలీసులకు మొరపెట్టుకున్నారు.

నేటి కూటమి ప్రభుత్వ హయాంలో..

2024 సెప్టెంబర్.. వేపగుంట సమీపంలోని దీర్ఘకాలికంగా ఉన్న ఓ స్థల వివాదం. స్థలం తనదిగా చెబుతున్న ఓ వ్యక్తికి.. ఎన్‌ఆర్‌ఐకి మధ్య యాజమాన్య హక్కు పోరు. జనసేన ప్రజాప్రతినిధికి దగ్గరగా ఉండే ఓ రౌడీషీటర్ తన మనుషులతో ఆ స్థలంలో పాగా వేశాడు. ఎన్‌ఆర్‌ఐలపై భౌతికదాడికి పాల్పడ్డాడు. బాధిత ఎన్‌ఆర్‌ఐ కుటుంబం పోలీసులను ఆశ్రయించింది.

2025 జనవరి 27 అర్ధరాత్రి నాయుడుతోట సమీపంలో ఇద్దరు వ్యక్తుల మధ్య స్వల్ప వివాదం. అంతే ఇద్దరిలో ఒకరైన చరణ్‌పై అవతలి వైపు ఉన్న రౌడీషీటర్ విచక్షణారహితంగా బ్లేడ్‌తో దాడికి పాల్పడ్డాడు. హత్య చేసేందుకు తీవ్ర ప్రయత్నం చేశాడు. రౌడీషీటర్ నుంచి చాకచక్యంగా తప్పించుకున్న బాధితుడు పెందుర్తి పోలీసులను ఆశ్రయించాడు.

- ఆర్థిక నేరాలు, మోసాలు, భూకబ్జాలు, భౌతికదాడులతో హల్‌చల్
- అధికారపార్టీ నాయకుల సెటిల్‌మెంట్లలో వీరి పాత్ర కీలకం
- ఎన్నడూ లేనంతగా రౌడీయిజంతో హడలిపోతున్న ప్రజలు
- గతంలోనూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇదే తరహా దందాలు
- పెందుర్తిలో 20 మందిపై రౌడీషీట్ ఓపెన్ చేసేందుకు పోలీసుల సన్నాహాలు.. అడ్డంపడుతున్న కూటమి నేతలు!?


పెందుర్తి పీఎస్‌లో నేరస్తులకు, రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ సతీష్‌కుమార్

శివారులో రౌడీషీటర్ల శివాలు


ఇటీవల రౌడీ షీటర్ చేతిలో దాడికి గురైన వ్యక్తి

పెందుర్తి: ప్రశాంతతకు మారుపేరుగా ఉండే నగర శివారు ప్రాంతమైన పెందుర్తి ప్రస్తుతం అరాచకశక్తులకు నిలయంగా మారింది. నియోజకవర్గంలో రౌడీషీటర్ల హడావుడి పెరిగిపోయింది. భూకబ్జాలు, ఆర్థిక మోసాలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పలు సెటిల్‌మెంట్లలో ఏకంగా కూటమి నాయకులతోనే కూర్చుని, పంచాయితీలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాకే ఈ తరహా రౌడీయిజం ఈ ప్రాంతంలో పెరిగిపోయిందని ప్రజలు వాపోతున్నారు. నియోజకవర్గంలోని రౌడీషీటర్ల జాబితాలో సగానికి పైగా కూటమి నాయకులు, వారి అనుచరులే ఉండడం గమనార్హం.

నాటి టీడీపీ హయాంలోనే జోరు

2014 నుంచి ఐదేళ్ల పాటు టీడీపీ హయాంలో భిన్నమైన పాలన సాగింది. అప్పటి వరకు అడపాదడపా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా అవి అనుకోకుండానో.. క్షణికావేశంలోనో జరిగేవి. కానీ అప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చాక క్రమేణా నియోజకవర్గంలో ఉండే చోటామోటా నాయకులు కూడా కబ్జాలు, సెటిల్‌మెంట్‌లకు అలవాటుపడ్డారు. నగరం నుంచి రౌడీషీటర్లను, రౌడీలను దిగుమతి చేసుకుని వారి అవసరాలకు వాడుకోవడం పరిపాటిగా మారింది. ఇందుకు వారికి తగిన పారితోషికాలు ఇవ్వడంతో పాటు, ఇక్కడే నివాసాలు కూడా ఏర్పాటు చేసే వరకు వ్యవహారం వెళ్లింది.

నియోజకవర్గంలో రౌడీషీటర్ల లెక్కలు (స్టేషన్ల వారీగా..)		
స్టేషన్	రౌడీషీటర్లు	అనుమానితులు
పెందుర్తి	55	30
(క్రైం జాబితాలో మరో 50 మంది అనుమానితులు)		
సబ్బవరం	9	7
పరవాడ	2	0
(వీరే గాక నగరం నుంచి వలస వచ్చిన రౌడీషీటర్ల సంఖ్య పదుల్లోనే ఉంది)		

నేడు మళ్లీ మొదలైన దందా

అప్పటి నుంచీ ఇక్కడ ఉంటున్న కొందరు రౌడీషీటర్లు తోక జాడిస్తే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పోలీసులు గట్టిగానే బుద్ధి చెప్పేవారు. దీంతో అప్పట్లో కొంత వరకు రౌడీయిజం తగ్గింది. అప్పటి ప్రజాప్రతినిధులు కూడా రౌడీలను దూరంగా ఉంచడంతో పోలీసులు స్వేచ్ఛగా తమ పని తాము చేసుకునేవారు. తాజాగా ప్రభుత్వం మారాక రౌడీ షీటర్లు కోరలు చాస్తున్నారు. ముఖ్యంగా పెందుర్తి పట్టణ ప్రాంతంలో రోజురోజుకూ వారి ఆగడాలు పెరుగుతున్నాయి. భూ ఆక్రమణలకు పాల్పడి ఎదుటివారిపై దాడులకు తెగబడుతున్నారు.

ఖాకీలకు సవాల్

ప్రశాతంగా ఉండే నియోజకవర్గంలో రౌడీయిజం చాపకింద నీరులా పాకడం పోలీసులను సైతం కలరపాటుకు గురిచేస్తుంది. కొన్నాళ్ల క్రితం పోలీస్ స్టేషన్లలోని రౌడీషీటర్లు, రౌడీలు, అనుమానితుల జాబితాతో పోల్చితే ఇటీవలకాలంలో ఆ చిట్టా రెట్టింపయింది. రౌడీయిజం నిర్మూలనకు కృషి చేస్తున్నామని బయటకు పోలీసులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు చేసే క్రమంలో అనేక 'ఒత్తిళ్ల'వారిని వెనక్కి లాగుతున్నాయి. తాజాగా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో దాదాపు 20 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేసేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే వీరిలో కొందరిపై షీట్లు ఓపెన్ చేయకుండా టీడీపీ, జనసేన నాయకులు రంగంలో దిగి పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రౌడీషీటర్లకు సమాజంలో స్థానం లేదు



రౌడీ షీట్, సస్పెక్ట్ షీట్ జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరిపై వ్యక్తిగతంగా నిఘా ఉంచుతున్నాం. వారి ఆగడాలు శృతిమించితే ఉన్నతాధికారుల సూచన మేరకు పీడీయాక్టు ప్రయోగించేందుకూ వెనుకాడం. ప్రజలకు హాని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులకు సమాజంలో స్థానం లేదు. ఎంతటివారైనా ఉపేక్షించబోం. శాంతి భద్రతలు కాపాడే విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు తావులేదు.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

క్లుప్తంగా

ఒడిశాలో ఘనంగా అప్పన్న కల్యాణోత్సవం


అప్పన్న ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం: ఒడిశా రాష్ట్రం పట్టుపురంలో సోమవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఒడిశాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా సింహాద్రి అప్పన్న సేవకుడు లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ ఆధ్వర్యంలో బరంపురానికి సమీపంలో ఉన్న పట్టుపురంలో ఉదయం శ్రీనృసింహ హోమం, రాత్రి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని, స్వామివారి సేవలో తరించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు పవన్‌కుమార్, వేద పండితులు ఈ కార్యక్రమాలను వైభవంగా జరిపారు. దేవస్థానం సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు, మహిళలు ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో అర్చన చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నియంత్రణ


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ సింహాచలం

సబ్బవరం: ప్రమాదాల నియంత్రణకు రహదారుల భద్రతా నియమాలను పాటించడం అందరి బాధ్యత కావాలని సబ్బవరం ఎస్‌ఐ పి.సింహాచలం సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రహదారుల భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విశాఖ జిల్లా నెహ్రూ యువ సంఘటన, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా సమితి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. యువత అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని విద్యార్థులను హెచ్చరించారు. అనతరం కళాశాలలో మానవహారం నిర్వహించారు. కళాశాల నుంచి సబ్బవరం మూడు రోడ్ల కూడలి వరకూ విద్యార్థులు ర్యాలీగా వెళ్లి, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, నెహ్రూ యువ సంఘటన ప్రతినిధి కె.లీలాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న దేముడు

పరవాడ: పెదముషిడివాడ పైడిమాంబ కాలనీకి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి, జనసేన పార్టీ నాయకుడు దాలిబోయిన దేముడు తన మనుమరాలు రేయాన్సీ శ్రీకరి పుట్టిన రోజు సందర్భంగా భర్నికం గ్రామంలోని న్యూ హోప్ చిల్డ్రన్స్ హోమ్ చిన్నారులకు సోమవారం అన్నదానం చేశారు. అక్కడి అనాథ పిల్లల అవసరాల కోసం చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులకు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించి, మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పెదముషిడివాడ జనసేన నాయకులు కర్లం నరసింగరావు, రాధా రంగ మిత్ర మండలి సభ్యులు బొండా లీలాకృష్ణ, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు శనివాడ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణంలో ఆర్థిక సాయం అందించాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, ప్రజలు


తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం, దరఖాస్తులు అందిస్తున్న ప్రజలు

పెందుర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుపేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు ఇంటి స్థలాల హామీని ప్రకటనలకే పరిమితం చేయకుండా చిత్తశుద్ధితో అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి ఒకొక్కరికి రూ.5 లక్షలు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం తమ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల హామీల విషయంలో మీడియా ప్రచారం తప్ప క్షేత్రస్థాయిలో ఒక్క పథకం అమలు కాలేదని ఆరోపించారు. నిరుపేదలకు ఇళ్ల పట్టాల హామీని తక్షణమే అమలు చేయాలని.. లేకపోతే పేదల పక్షాన ఉద్యమం తీవ్రస్థాయికి తీసుకువెళతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం, దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, అన్నపూర్ణ, అరుణ, రజని, రాము, రమణ, పరశురాం, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

'అయోధ్య' నిందితుడిని ఉరి తీయాలి


ఆందోళన చేస్తున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు, మహిళలు

పెందుర్తి: అయోధ్యలో దళిత యువతిపై అత్యాచారం చేసి దారుణంగా హతమార్చిన నిందితుడిని తక్షణమే ఉరి తీయాలని రాష్ట్ర మహిళా సమాఖ్య పెందుర్తి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అరుణ, ఎ.అన్నపూర్ణ డిమాండ్ చేశారు. అయోధ్యలో దళిత యువతి హత్యాచారంపై నిరసన వ్యక్తం చేస్తూ స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, ఆ పార్టీ భాగస్వామ్య పాలన ఉన్న రాష్ట్రాల్లోనే మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వేధింపులు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆరోపించారు. మహిళలను రక్షించడంలో ప్రభుత్వాలు దారుణంగా విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్య ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమాఖ్య ప్రతినిధులు కక్కల రజని, దేవి, మట్ట సంతోషి, బాసురు లక్ష్మి, దీవెన, మహిళలు పాల్గొన్నారు.

మర్రిచెట్టే బస్ షెల్టర్!


మర్రి చెట్టు కింద బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు

పరవాడ: స్థానిక సబ్‌స్టేషన్ కూడలిలో బస్ షెల్టర్ లేక పోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు అగచాట్లు పడుతున్నారు. అచ్యుతాపురం, ఆవసోమవరం, ఇరువాడ, వాడచీపురుపల్లి, తంతడి, రాజన్నపాలెం తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు బస్సులపై రాకపోకలు సాగిస్తూ పరవాడలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతున్నారు. రాకపోకల సమయంలో పరవాడ సబ్‌స్టేషన్ వద్ద మర్రిచెట్టు కిందే గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. సబ్‌స్టేషన్ కూడలిలో బస్సు షెల్టర్ లేకపోవడంతో, విద్యార్థులతో పాటు సాధారణ ప్రయాణికులూ ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా వానైనా మర్రిచెట్టే వీరికి ఆశ్రయం. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి సబ్‌స్టేషన్ కూడలిలో బస్ షెల్టర్ నిర్మించాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

చెత్త బండి.. మూలకు చేర్చారండి!


స్వల్ప మరమ్మతులతో మూలకు చేరిన చెత్తను తరలించే మినీ వ్యాన్

పరవాడ: ఫార్మాసిటీలోని మెలాన్ పరిశ్రమ యాజమాన్యం రూ.లక్షల వ్యయంతో వాడచీపురుపల్లి గ్రామ పంచాయతీకి సమకూర్చిన మినీ వ్యాన్(చెత్త బండి) స్వల్ప మరమ్మతులతో మూలకు చేరింది. మినీ వ్యాన్‌కు ఏర్పాటు చేసిన బ్యాటరీ పాడైంది. ఇంజన్‌లో కూడా స్వల్ప మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. దీంతో కొన్ని నెలలుగా ఈ వ్యాన్‌ను పక్కన పెట్టేశారు. మినీ వ్యాన్ మూలకు చేరడంతో ట్రాక్టర్ సాయంతో చెత్తను తరలిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ వ్యాన్‌కు మరమ్మతులు చేపట్టకపోతే పూర్తిగా తుప్పు పట్టి, ఎందుకూ పనికిరాకుండా పోయే పరిస్థితి. పంచాయతీ అధికారులు చొరవ చూపి, దీనికి మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తీసుకురావాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు అభినందన

అగనంపూడి: ఔషధ శాస్త్రంపై నిర్వహించిన సదస్సులో దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చి బహుమతులు దక్కించుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజుల కిందట చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్, ఫార్మానెస్ట్ 5ఈ, వీవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, గుంటూర్ విజ్ఞాన్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సదస్సులో దువ్వాడ ఫార్మా కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించడంతో సోమవారం కళాశాలతో వారిని అభినందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి.వి. కమల కుమారి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి


కోక్‌ఓవెన్స్ విభాగాధిపతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని ఉక్కు అఖిల పక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సోమవారం కోక్‌ఓవెన్స్, ఆర్.ఎం.హెచ్.పి, టీపీపీ, సింటర్ ప్లాంట్ విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి జోలికి రాబోమని అక్టోబర్ 2న ఆర్ఎల్‌సీ సమక్షంలో అంగీకరించి, ఇప్పుడు దొడ్డిదారిన తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జి. శ్రీనివాసరావు, మంత్రి రవి, ఉమ్మిడి అప్పారావు, శోభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

సంత ప్రాంగణంలో పశువుల తరలింపు


సంత ప్రాంగణంలో సంచరిస్తున్న పశువుల్ని వ్యానులో ఎక్కిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

సింహాచలం: అడవివరంలో గురువారం జరిగే సంత ప్రాంగణంలో సంచరిస్తున్న పశువుల నియంత్రణకు జీవీఎంసీ చొరవ చూపింది. సంత సమయంలో దుకాణాలపై, కొనుగోలుదారులపై ఎగబడుతున్న పశువులతో నెలకొన్న ఇబ్బందులపై 'గురువారం సంత.. పశువులతో చింత'శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సంత ప్రాంగణంలో సోమవారం సంచరిస్తున్న మూడు జీవాలను జీవీఎంసీ 8వ జోన్ ప్రజారోగ్య అధికారులు పట్టుకున్నారు. వ్యాన్‌లోకి ఎక్కించి ముడసర్లోవలోని జీవీఎంసీకి చెందిన పశువుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంత ప్రాంగణానికి చేరుకుని, పశువుల సంచారాన్ని గమనించారు. వాటని వ్యాన్‌లో తరలించారు. సంత ప్రాంగణంలోకి పశువులను వదిలిపెడుతున్న వాళ్లు ఎవరైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

'టిడ్కో గృహస్తులకు రక్షణ కల్పించండి'


పోలీసులకు ఫిర్యాదు అందిస్తున్న ఐద్వా నాయకులు

పరవాడ: స్థానిక టిడ్కో గృహాల్లో నివసిస్తున్న వారికి అపరిచితుల నుంచి రక్షణ కల్పించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. ఈ మేరకు సోమవారం పరవాడ పోలీసులకు ఆమె ఫిర్యాదు అందించారు. కాలనీలో సొంతిళ్లు మంజూరైన వారు స్థానికంగా నివాసించకుండా, ముక్కూమొహం తెలీని అపరిచితులకు అద్దెలకు ఇస్తున్నారని పేర్కొన్నారు. దీంతో కాలనీలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తెలిపారు. అద్దెలకు ఉంటున్న వారు మద్యం సేవించి గొడవలు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. కాలనీలో తరచూ దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్ల తలుపులు పగుల గొట్టి చోరీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఫిర్యాదు అందించిన వారిలో ఐద్వా ప్రతినిధులు ఎస్.సూరమ్మ, డి.లక్ష్మి, శాంతి, పరదేశమ్మ, కృష్ణవేణి, ఇందుమతి, బంగారమ్మ, గౌరి, ధన, రాణి, వరలక్ష్మి ఉన్నారు.

ఘనంగా ప్రారంభమైన శారదాపీఠం వార్షికోత్సవాలు


చిన్నారితో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి


శారదాపీఠంలో అక్షరాభ్యాసాల్లో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

- వసంత పంచమి సందర్భంగా పీఠంలో అక్షరాభ్యాసాలు

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠం వార్షిక మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. వసంత పంచమి సందర్భంగా వందలాది మంది చిన్నారులకు శాస్త్రోక్తంగా పండితులు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ముందుగా పీఠంలో సరస్వతి పూజ ఘనంగా చేశారు. విద్యార్థులకు పరీక్షా సమయం కావడంతో రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో పూజలు జరిపిన పెన్నులు, పుస్తకాలు పీఠం ప్రతినిధులు అందించారు. స్వాత్మానందేంద్ర సరస్వతి చేతుల మీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

కామేశ్వరీదేవిగా సహస్రాక్షి రాజరాజేశ్వరి


వాగ్దేవి హోమంలో పాల్గొన్న చిన్నారులు


అనంత బాబాతో సినీ నటుడు అవసరాల శ్రీనివాస్, మిత్ర బృందం

సబ్బవరం: మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి 5వ రోజైన సోమవారం కామేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలోని యాగశాలలో కామేశ్వరీ సహిత లఘు శ్యామ హోమం నిర్వహించారు. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకున్న వారికి ఈతిబాధా వినాశనం, ఉన్నత విద్యా ప్రాప్తి, విదేశీ ప్రదాయకం కలుగుతుందని ప్రతీతి. ఉదయం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అనంతరం సుమారు 40 మంది బాల బాలికలు, అమృత కన్యా గురుకులం పిల్లలతో వాగ్దేవి హోమం జరిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హరిద్వార్ పుణ్యక్షేత్రం అనంతథామ్ నుంచి అనంత బాబా, వారి శిష్యుడు, సినీ నటుడు అవసరాల శ్రీనివాస్, శిష్య బృందంతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం విశాఖ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నుంచి హనుమంతరావు, షణ్ముక శర్మ శిష్యురాళ్లు ప్రదర్శించిన నాట్య నివేదన ఆకట్టుకుంది.